కథ

రీసైక్లింగ్

డాక్టర్ ఎ. సంతోష్ రెడ్డి
9704129159

తెల్లారేందుకు ఇంకా చాలా టైముంది..

వీధిలైట్ల వెలుతురుకూ, మిగులురాత్రి చీకటికీ నడుమ జరిగే యుద్ధంలో పరిసరాలు మసకమసగ్గా ఉన్నాయి.

ఆ పిల్లకు పన్నెండేళ్లకన్నా ఎక్కువుండవు. మసక చీకట్లో రోడ్డుపక్కన ప్రాణం పోసుకున్న నీడలా కదులుతోంది. మధ్యమధ్య కాసేపు ఆగుతూ.. వీపుమీద వేలాడుతున్న సంచీ కిందికి దించుతూ.. తిరిగి భుజమ్మీద వేసుకుంటూ సాగిపోతోంది.

ఆమె చూపులు చుట్టూ చురుగ్గా గమనిస్తున్నాయి. చేతులు యంత్రాల మాదిరి కదుల్తూ చెత్తలో పారేసిన వస్తువుల్ని పోగేసుకుంటున్నాయి.

ప్లాస్టిక్ బాటిళ్లు, సీసాలు, చిత్తు కాగితాలు, అట్టడబ్బాలు, పైపు ముక్కలు, ఇనుప తుక్కుసామాన్లు, చిరిగి పాడైన బ్యాగులు, ప్లాస్టిక్ సంచులు, ఫ్యాన్ల రెక్కలు, అప్పుడప్పుడూ బ్రెడ్ ముక్కలు.. ఒక్కటేమిటి పనికొస్తుందనుకున్న వస్తువేది దొరికినా ఎత్తి సంచిలో వేస్తోంది.

సన్నగా బక్కపల్చని ఆకారం. పాలిపోయిన ముఖం. ముక్కుకి, నోటికి అడ్డంగా కట్టుకున్న బట్ట. కాళ్లకి రెండు వేర్వేరు సైజుల్లో పాత చెప్పులు. అవికూడా ఎక్కడో పెంటకుప్పల్లో దొరికినవే. నడిచేందుకు ఇబ్బంది పడుతూ అట్లాగే నడుస్తున్నది.

తెల్లారేందుకు ఇంకా సమయముంది..

చలికి వొణికే నగరం ఒకవైపు వొత్తిగిలి పీడకలల మధ్య కలతనిద్ర పోతోంది. నగరానికి వడ్డాణంలా చుట్టుకొని మట్టిపాములా ప్రవహించే మురికి నది.. కాలుష్యాన్ని కడుపులో మోస్తూ విషకన్యలా కదులుతోంది.

అన్ని ఊర్లలాగే ఆ ఊరుకూ తనదైన ఉనికి ఉంది. తనవనుకునే పగళ్లూ రాత్రుళ్లూ. మంచిదో చెడ్డదో ఏళ్ల తరబడి సృష్టించుకున్న సంస్కృతి. ఆకాశాన్ని తాకే బహుళ అంతస్తుల భవనాలు. చెట్లకు బదులు నిలబడి ఉన్న కరెంటు, టెలిఫోన్ స్తంభాలు. అభివృద్ధి పేరిట విస్తరించిన కాంక్రీట్ అడవులు. పగలు ఇరుకుగా, రాత్రుళ్లు విశాలంగా మారే రహదార్లు. వన్య ప్రాణుల్లా అక్కడక్కడా వృద్ధాప్యం మీదపడ్డ వృక్షాలు. రోబోల్లా బతికేస్తున్న మనుషులు. పొద్దుపొడిస్తే ఊరుకులూ పరుగులూ.

తెల్లారేందుకు ఇంకొంత వ్యవధి ఉంది..

మానవ గూళ్లు ఇంకా నిద్రలోనే జోగుతున్నాయి. రోడ్ల పక్కన ఫ్లోరోసెంట్ లైట్లు అలసటగా చీకటితో పోరాడుతున్నాయి. ఉపనదుల్లా పారుతున్న తారురోడ్లు చొక్కాకు కుట్టిన గుండీల మాదిరి నగరాన్ని అనుసంధానం చేస్తున్నాయి. కొమ్మల్ని ఊపుతూ కదలాడే అలవాటు మర్చిపోయిన నగర చెట్లు దిష్టిబొమ్మల్లా నిల్చుని దిక్కులు చూస్తున్నాయి.

ఇవేం పట్టించుకోకుండా రాజమ్మ నడుస్తోంది. వీధుల్లో మూలమూలల్లో చెదపురుగులా తిరుగుతోంది. ఫుట్‌పాతులు, సెల్లార్లు, పీడబ్ల్యూడీ నిర్లక్ష్యంగా వొదిలేసిన గుంతలు, దుర్వాసనల్ని వెదజల్లే మురికి కాల్వల్ని దాటుకుంటూ పోతోంది. నట్టనడి శీతాకాలపు చలి గజగజ వణికిస్తున్నా ఆమెకి ఖాతరు లేదు.

తెల్లారేందుకు కనీసం ఇంకో గంట గడువుంది..

ప్రతిదినం కోడికూయక ముందే లేచి రోడ్డెక్కుతుంది రాజమ్మ. తన పని అట్లాంటిది. వీధిమూలలు, ఖాళీస్థలాలు, డస్ట్ బిన్స్, చెత్తకుప్పలే ఆమె ప్రపంచం. పారేసిన, పనికిరాని వస్తువుల కోసం నిద్రకళ్లతోనే గాలిస్తూ తిరుగుతుంది.

ఆమె దినచర్య చెత్త ఏరుకోవడంతో మొదలై.. పోగేసుకున్న వస్తువుల్ని స్క్రాప్ డీలరుకు అమ్ముకోవడం, అతనిచ్చే డబ్బులతో కొంపకు చేరుకోవడంతో ముగుస్తుంటుంది.

అన్ని వృత్తుల్లో మాదిరే చెత్త ఏరుకోవడంలోనూ పోటీ ఉంది. ఎవరికివారే ముందుగా వచ్చి వీధుల్లో గాలింపులు జరుపుతారు.

ఆలస్యంగా రోడ్లమీదకొస్తే దొరికేది ఏమీ ఉండదు. రాజమ్మకు ఈ సంగతి బాగా తెలుసు. అందుకే చీకటితోనే లేచి బయటపడుతుంది.

దేశమేదైనా.. ప్రాంతమేదైనా చెత్త ఎక్కడైనా చెత్తనే! పనికిరాని వస్తువులు ప్రతిచోటా ఉండేవే. భిన్నప్రాంతాల సంస్కృతులు భిన్నంగా ఉండొచ్చు. కానీ, పారేసిన చెత్త సంస్కృతి ఎక్కడైనా ఒకే తీరు. అట్లాగే చెత్త ఏరుకొని బతుకులు సాగించే జీవులంతా సేమ్ టు సేమ్.

నానారకాలైన కుళ్లు, వెగటు వాసనల్ని పీలుస్తూ గంటలు గంటలు జనం అసహ్యించుకునే ప్రదేశాల్లో తిరగడం. అలుపొస్తే ఏ ఫుట్‌పాత్ మీదో, మెట్ల కిందనో ఒకింత సేద దీరడం. తిరిగి అదే వేటలో సాగిపోవడం.

పెంటకుప్పల్లో చేతులుపెట్టి వెతకడం. నాలాల్లో.. మురుగునీళ్లలో తేలియాడే వస్తువుల్ని కూడా పట్టుదలగా సమీకరించడం.

కొన్నిసార్లు చెత్తను కెలుకుతుంటే చేతులకి అంటరాని వ్యర్థాలు, మలమూత్ర